నేడు సెమినార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న తాజా సవాళ్లు - ప్రజాస్వామ్య మనుగడపై ప్రభావం' అనే అంశంపై నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు సెమినార్ నిర్వహించనున్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించనున్న సెమినార్ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ప్రధాన వక్తగా పాల్గొనున్నారు. ఇదే సెమినార్‌లో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, కవి, వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్యనారాయణ జయంతితో పాటు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు కీ.శే వి.జి.కె మూర్తి జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌కు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

డిగ్రీ ప్రవేశాల జాప్యంతో విద్యార్థులకు నష్టం

● ఫిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు ● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 140 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఇంటర్ ఫలితాలు వచ్చి రెండు నెలలు కావస్తున్నా డిగ్రీ ప్రవేశాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందు అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఒక పక్క మేజర్, మైనర్ విధానం వల్ల డిగ్రీ చదవలేని పరిస్థితిలో విద్యార్థులు ఉంటే ఎంట్రన్షిప్ భారం మరింత ఎక్కువవుతోందన్నారు. ఎంట్రన్షిప్‌ను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నారాయణ కళాశాల వ్యవహరిస్తున్నా, ఆర్ఐఒ దుర్గాప్రసాద్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను ఆగస్టు 10వ తేదీ నుంచి మూసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం స్విమ్మింగ్ క్రీడాకారులకు తీవ్ర నష్టం కలిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఖగేష్, జిల్లా కమిటీ సభ్యుడు జయరాం, టౌన్ కమిటీ సభ్యుడు పి.కార్తీక్ తదితరులున్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

కె.మత్స్యలేశంలో బడి కొనసాగించాలి

పాఠశాలల విలీనం పేరుతో తమ ఊరి బడిని తరలించొద్దంటూ గార మండలం కె.మత్స్యలేశంకు చెందిన తల్లిదండ్రులు, విద్యార్థులకు వినతిపత్రం అందించారు. 2020-21లో ఆరు నుంచి ఎనిమిది వరకు ఏడుగురు మాత్రమే ఉన్నారని, ఇప్పుడు ఆ విద్యార్థుల సంఖ్య 40కి చేరిందన్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మొత్తం 83కి చేరిందన్నారు. ఈ తరుణంలో 6,7,8 తరగతులను కళింగపట్నం హైస్కూల్‌కు తరలిస్తే విద్యార్థులకు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 40 మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో, వారి భవిష్యత్ ఏమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోనే ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్ బి.లలిత, ఎస్ఎంసి చైర్మన్ పి.లక్ష్మి, గ్రామ పెద్దలు ఉన్నారు.

అర్హత ఉన్నా తల్లికి వందనం రాలేదు

అర్హత ఉన్నా తల్లికి వందనం పథకం తమకు వర్తించలేదని లావేరు మండలం బుడుమూరు సచివాలయం పరిధిలోని తల్లులు రమ్య, పార్వతి, స్వప్న ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు చెల్లించి పిల్లలను చదివిస్తున్నామని, విద్యాహక్కు చట్టం కింద పిల్లలకు ప్రభుత్వం ఫీజు చెల్లిస్తున్నట్లు కారణం చూపిస్తున్నారని తెలిపారు. గార మండలం వాడాడలో గ్రామానికి ఆనుకోని కోళ్ల ఫారం ఉందని పారిశుధ్య సమస్య మారిందని మహిళలు ఫిర్యాదు చేశారు. పిఎన్ కాలనీ పదో లైన్‌లో పైపులైన్ కోసం తీసిన గోతులు పూడ్చలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. జి.సిగడాం మండలం పాలఖండ్యాంలో జగనన్న కాలనీలో రోడ్డులు లేవని 31 ఇళ్లకు చెందిన మహిళలు ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహి ళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, పంచాయతీరాజ్ తదితర శాఖల సమస్యలపై 140 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

329 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి - సోంపేట

బీలలోని చిత్తడి నేలలు, పర్యావరణాన్ని రక్షించుకోవడానికి థర్మల్ విద్యుత్కేంద్రానికి వ్యతిరేకంగా స్థానికులు సాగించిన పోరాటం సంపూర్ణంగా విజయవంతం కావాలంటే ప్రభుత్వం 329 జిఒను రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. సోంపేట థర్మల్ కాల్పుల ఘటనకు 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోరాటంలో అమరులైన ముగ్గురు అమరులకు బీలలోని అమరవీరుల స్థూపం వద్ద పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యాన సోమవారం నివాళ్లర్పించారు. అనంతరం స్థూపం పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం బారువ బీచ్ రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్‌లో పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు వై.కృష్ణమూర్తి అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన జిఒ రద్దు చేసినా, అదే స్థానంలో బహుళజాతి కంపెనీల ఏర్పాటుకు సంబంధించి విడుదల చేసిన 329 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై అక్రమంగా బనాయించిన కేసులను పూర్తిగా ఎత్తివేయాలని, గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల మనుగడ కోసం, భావితరాల భవిష్యత్ కోసం అమరులైన రైతుల త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం అందరూ ఒక్కటై సాగించిన ఈ ఉద్యమం చిరస్థాయిగా స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుందన్నారు. మానవ హక్కుల వేదిక సభ్యులు వి.ఎస్ కృష్ణ, కె.వి జగన్నాథం మాట్లాడుతూ బీల భూముల్లో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయకుండా, ఈ ప్రాంత ప్రజలు చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిందన్నారు. ప్రజల పోరాట ఫలితంగా ప్లాంట్ రద్దయిందని తెలిపారు. కార్యక్రమంలో బార్ల సుందరరావు, సూరాడ చంద్రమోహన్, ఎర్ర రజిని, బడే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ అమరుల సంస్మరణ సభలో వక్తలు



అమరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

మద్యం మత్తులో విగ్రహాల ధ్వంసం

● డి.ఆర్ వలస ఘటనను ఛేదించిన పోలీసులు
● నిందితుడు రామకృష్ణ అరెస్టు
● ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జి.సిగడాం మండలం డి,ఆర్ వలస (దాలంరాజు)లో ఈనెల 11వ తేదీన స్థానిక శివాలయంలో చోటుచేసుకున్న విగ్రహాల ధ్వంసం కేసును పోలీసులు ఛేధించారు. ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన రామకృష్ణ అనే నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసుల కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డి.ఆర్ వలసకు చెందిన వేమల రామకృష్ణ అనే వ్యక్తి మద్యానికి బానిసై భార్య, కుటుంబసభ్యులతో తరుచూ గొడవ పడుతుండేవాడు. రామకృష్ణ బాధలు భరించలేక 2022లో ఆమె కన్న వారి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో నిందితుడు తన తల్లిదండ్రులు తమ్ముడు కుటుంబం ఉంటున్న ఇంట్లోనే ఉండేవాడు. వారంలో రెండు, మూడు రోజులు పనిలోకి వెళ్లి వచ్చిన డబ్బులతో మద్యం సేవించేవాడు. ఈనెల ఎనిమిదో తేదీన మద్యం కోసం డబ్బులు కావాలని కుటుంబసభ్యులతో గొడవ పడ్డాడు. ఇంటి నుంచి వెళ్లిపోయి స్థానికంగా ఉన్న శివాలయంలో తిండి లేకుండా పడుకున్నాడు. ఈనెల 11వ తేదీన నారాయణ అనే కార్పెంటర్ రామకృష్ణకు రూ.300 ఇచ్చి పనిలోకి రావాలని కోరాడు. నిందితుడు ఆ డబ్బులను తీసుకుని రాత్రి ఏడు గంటల సమయంలో సర్వేశ్వరం గ్రామ కూడలిలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి రెండు క్వార్టర్ల మద్యం బాటిళ్లను కొనుగోలు చేశాడు. అందులో ఒకటిన్నర సేవించి, తన జీవితం పోయిందని, దేవుని తిడుతూ మిగిలిన హాఫ్ క్వార్టర్ మద్యం తాగడానికి నవగ్రహ ఆలయం పక్కన ఉన్న వాటర్ ట్యాప్ పట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఇనుప రాడ్ తీసుకుని ఆలయంలోకి ప్రవేశించాడు. తనకు శని దేవుడు పట్టుకోవడం వల్లే జీవితం పోయిందని, అక్కడ ఉన్న తొమ్మిది విగ్రహాలను విరగ్గొట్టాడు. తర్వాత హాఫ్ క్వార్టర్ మద్యం సేవించి రాత్రంతా శివాలయంలోనే నిద్రించాడు. ఉదయం ఐదు గంటలకు లేచి కోనేరులో స్నానం చేసి ఇనుప రాడ్‌ను దూరంగా ఉన్న పొదల్లో దాచి పెట్టి వెళ్లిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రత్యేక పోలీసు బందాలను నియమించి నేర స్థలంలో లభించిన మద్యం సీసాలు, సాంకేతిక ఆధారాలు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వివరాలు, ఫింగర్ ప్రింట్స్ సేకరణ, స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేశారు. నిందిడుతు గతంలో కూడా అదే గుడిలో పూజారి అయ్యప్ప మాల వేసిన సమయంలో గుడిలో ఉన్న దేవుడి పటాలను పగులకొట్టడంపై కేసు ఉందని తెలిపారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

వృద్ధురాలిపై దాడి, దోపిడీ కేసులో నిందితుడు అరెస్టు

శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హయాతీనగర్, బాలాజీనగర్‌లో ఈనెల తొమ్మిదో తేదీన వృద్ధురాలు పొడుగు ఆరుద్రమ్మపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు తాడు చోరీ కేసులో నిందితుడు జీరు సురేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. నిందితుడు నుంచి 35.70 గ్రాముల బంగారం తాడును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు చెడు వ్యసనాలకు లోనై చేసిన అప్పులు తీర్చలేక దొంగతనాలకు అలవాటు పడ్డాడని చెప్పారు. నిందితుడు గతంలోనూ చోరీ కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి బెయిల్‌పై ఉన్నాడని తెలిపారు. స్వల్ప వ్యవధిలో ఈ రెండు కేసులను ఛేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా ప్రశంసలు తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి వివేకానంద, జె.ఆర్ పురం, వన్‌టౌన్ సిఐలు అవతారం, కె.పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జీడిపప్పుకు జాతీయ అవార్డు

ఢిల్లీలో స్వీకరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అవార్డు అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఉద్యానశాఖ అధికారి వరప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) కింద పలాస జీడిపప్పు ఉత్తమ ఉత్పత్తిగా ఎంపికైన నేపథ్యంలో అవార్డును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఢిల్లీలో సోమవారం అందుకున్నారు. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర వస్త్రోత్పత్తుల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఈ అవార్డును ప్రదానం చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రత్నాల వరప్రసాదరావు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిత్లీ తుపానుతో జీడితోటలు ధ్వంసమైనా, అదే ఓ మలుపుగా మారిందన్నారు. పునరుద్ధరణ చర్యలు, అధిక దిగుబడినిచ్చే జాతుల ప్రోత్సాహం, ఉపాధి హామీ వినియోగంతో సాగు విస్తరించిందని తెలిపారు. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమలకు నూతన దిశ చూపగలిగామన్నారు. ఇది జీడి రైతుల కృషికి, అధికార యంత్రాంగ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణకు లభించిన గుర్తింపు అని అన్నారు. అనంతరం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మన రైతులు పండించిన పంటకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అందరికీ గర్వకారణమని కేంద్రమంత్రి అన్నారు.

ఎరువులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అవకతవకలకు పాల్పడితే చర్యలు

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆమదాలవలస : ఎరువుల షాపుల యజమానులు అవకతవకలకు పాల్పడినా, రైతులకు అధిక రేట్లకు విక్రయించినా చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల హోల్‌సేల్ డీలర్ వైశ్యరాజు, రాజేంద్ర రిటైలర్ షాప్, మన గ్రోమోర్ దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌లోని ఎరువుల బస్తాలను, రసీదు, పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు, కౌలు రైతులు అయితే కౌలు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ఎరువుల దుకాణాలకు తీసుకువచ్చి చూపించి ఎరువులను తీసుకువెళ్లాలని అన్నారు. పట్టాదారు పాస పుస్తకాలను చూసి పంటకు సరిపడా ఎరువులను పంపిణీ చేయాలని వ్యాపారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, వ్యవసాయ సహాయక సంచాలకులు బగ్గు రజిని, ఎఒ మెట్ట మోహనరావు, వ్యవసాయ విస్తరణాధికారి రాము, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయితేజ, అజిత్ కుమార్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ మూత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం: ఆగస్టు పదో తేదీ నుంచి శ్రీకాకుళం నగరంలోని స్విమ్మింగ్‌పూల్‌ను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, డి.చందు డిమాండ్ చేశారు. అక్టోబరులో స్కూల్ గేమ్స్ పోటీలు ఉండగా, ఆగస్టులో మూసివేయడం వల్ల స్విమ్మింగ్ క్రీడాకారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ గేమ్స్ పూర్తి కాకుండా స్విమ్మింగ్ పూల్ మూసేయాలని ఏవిధంగా నిర్ణయం తీసుకున్నారని వారు ప్రశ్నించారు. స్విమ్మింగ్ క్రీడాకారులు కొన్నేళ్లుగా అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి స్కూల్ గేమ్స్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నారని, ఆగస్టులో స్విమ్మింగ్ పూల్‌ను మూసేయడం వల్ల రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ క్రీడా పోటీలకు జిల్లా క్రీడాకారులు దూరమవుతారని తెలిపారు. జిల్లాలోని ఏకైక స్విమ్మింగ్ పూల్ ద్వారా స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహించే అవకాశం కోల్పోతారని చెప్పారు. స్విమ్మింగ్ పూల్‌ను కొనసాగించాలని, స్విమ్మింగ్ క్రీడాకారులకు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గోపి హత్యపై దర్యాప్తు చేయాలి

ఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వైసిపి నాయకుడు సత్తారు గోపి హత్య ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు చేసి హంతకులను త్వరగా అరెస్టు చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కోరారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసమే గోపి హత్య జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని తెలిపారు. రాజకీయాల్లో ఇది మంచి సంస్కృతి కాదన్నారు. ఎప్పుడూ ఒకే పార్టీ అధికారంలో ఉండదన్న విషయాన్ని టిడిపి నాయకులు గుర్తెరగాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఫరీదుపేటలో ఇది రెండో హత్య అని, గతంలోనూ వైసిపి కార్యకర్తపై దాడి చేసి అంతమొందించారని చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, నాయకులు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్ తదితరులున్నారు.

విద్యా విధానం భ్రష్టు పట్టింది

● దాన్ని వివరించేందుకే యూనివర్శిటీ సినిమా
● ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి

మాట్లాడుతున్న నారాయణ మూర్తి

ప్రజాశక్తి - సోంపేట

ప్రస్తుతం కొనసాగుతున్న విద్యా విధానం భ్రష్టు పట్టిపోయిందని, నేటి విద్యా విధానంలోని లోపాలను ప్రజలకు ఎత్తిచూపేందుకే 'యూనివర్శిటీ' పేపర్ లీక్ అనే ట్యాగ్‌లైన్‌తో సినిమాను రూపొందించినట్లు ప్రముఖ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. బారువలోని కన్వెన్షన్ హాల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానం పూర్తిగా కార్పొరేట్ సంస్థల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయిందన్నారు. తమ కళాశాల, యూనివర్శిటీలో చదివితేనే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందనే రీతిలో ప్రకటనలు గుప్పిస్తున్నారని విమర్శించారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ప్రకటనలు చూసి అప్పులు చేసి మరీ తమ పిల్లలను అక్కడ చదివిస్తున్నారని చెప్పారు. విద్యారంగాన్ని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని, అప్పుడే అందరికీ సమానమైన విద్య అందుతుందన్నారు. ఇటువంటి కథాంశంతోనే తాను రూపొందించిన యూనివర్శిటీ సినిమా ఆగస్టు 28న రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక సమస్యతో తెరకెక్కించిన ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

నేటి నుంచి ఎపిపిఎస్‌సి పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు ● జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) లెక్చరర్ పోస్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. మొత్తం 743 మంది అభ్యర్థుల కోసం జిల్లాలో శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట), ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (టెక్కలి) పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రంలోనూ బయోమెట్రిక్ ధ్రువీకరణ, సిసి కెమెరాల పర్యవేక్షణ, పోలీసు భద్రత, వైద్య సహాయం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

అభ్యర్థులు పరీక్షకు ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, పేపర్లు వంటి వాటిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఉదయం నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులను 8 నుంచి 8.45 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షలకు ఒంటి గంట నుంచి 1.45 గంటల వరకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయానికి అదనంగా గరిష్టంగా 15 నిమిషాల సమయ వెసులుబాటు ఉంటుందన్నారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరని స్పష్టం చేశారు. సమావేశంలో రూరల్ సిఐ పైడపు నాయుడు, డిప్యూటీ తహశీల్దార్లు ఎస్.బాలకృష్ణ, డి.రామకృష్ణ, పి.నిరంజన్ కుమార్, కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సూర్యచంద్ర అధ్యక్షతన పది ప్రైవేట్ కంపెనీలు 475 ఉద్యోగాలు నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు ప్రతిఒక్కరిలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమానయానశాఖ మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచెన్నాయుడు యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు అన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. జాబ్ పొందిన వారు అవకాశాన్ని విడిచిపెట్టకుండా విధుల్లోకి చేరాలన్నారు. కష్టపడి పనిచేస్తే భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మాధవరపు వెంకటేష్, సీనియర్ నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రెడ్డి గిరిజశంకర్, టిడిపి బిసిసెల్ పట్టణ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, ఎండు చిన్నారావు, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

మహారాజశ్రీ విజయనగరం 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA 19/2025, OS 4/2023

Between :
Bhavana Gowri Venkata Satya Vara Prasad ......Petitioner/Plaintiff
And :
Velturi Rajeswaramma and others .....Respondents

Notice to R-26
Pothireddi Nagaraju, S/o Bangari, Kotapalem Village, Ranasthalam Mandal, Srikakulam District.

పై నెంబరు పిటిషనులో మీకు అనేకసార్లు పై కోర్టువారి నుండి నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు పిటిషను మీకు నోటీసు నిమిత్తం తే 28-7-2025దీకి వాయిదా వేసిరి. సదరు పిటిషనులో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 28-7-2025దీ ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై పిటిషను మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner,
Vizianagaram,
Cell: 9441053628

NOTICE
IN THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) COURT AT SRIKAKULAM
IP.No:12/2025

Between:
Sri.Nakka Murali .....Petitioner
And:
Sri.Kottapalli Krishna Rao & 6 others. ......Respondents

To,
R-1: Sri. Kottapalli Krishna Rao, S/o Laxminarayana, aged about 42 years, Occ. CRPF Employee, R/o 1-406, Goppili Village, Pedda Street, Meliyaputti Mandal, Srikakulam District. Ph.824725301
R-2: Sri. Gunda Kotibabu, S/o Chinnam Naidu, aged about 40 years, Occ.CRPF Employee, R/o D.No.3-128, Ampolu Village, Gara Mandal, Srikakulam District. Ph.No.9346083589
R-3:Sri.Tammineni Srinivasa Rao, S/o Varada Rajulu, Occ.Retd. Army & Pvt. Finance Business, R/o H.No.2-11, Main Street, Thogaram Village, Amadalavasa Mandal, Srikakulam ph.950513935
R-4: Sri.Gandubilli Raja Sekhar, S/o not known to the petitioner, aged about 41 years, Occ.Pvt. Finance Business, R/o Main Road, Kalivaram Village, Near Sachivalayam, Amadalavalasa Mandal, Srikakulam District. Ph.No.703237985
R-5: Sri.Kakala Himaraja Sekhar, S/o not known to the petitioner, aged about 24 years, Occ. Pvt. Finance Business, R/o Mahalaxminagar Colony, SC Street, Near Women's College, Srikakulam. Ph. 9398063408
R-6: Sri.Adangi Vijaya Krishna, S/o Venkata Rao, aged about 39 years, Occ.Pvt. Employee, R/o Adangi Street, Near Kinnera Complex, Srikakulam. Ph.9502649473
R-7: Padma Pujitha Finance, Peddapadu Road, Srikakulam District, Ph.9281445214

పై నెంబర్ పిటిషన్‌ను, పిటిషనర్ తనను insolvent personగా డిక్లేర్ చెయ్యమని దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ పై ఎవ్వరికైనను ఎట్టి ఆక్షేపణలు ఉన్నచో, పై కోర్టు వారి ఎదుట **తేది 01-08-2025 ఉదయము 10.30 గం.లకు** స్వయంగా గాని, వకీలు గాని హాజరై తెలియచేయవలయును, లేనిచో పిటిషనర్ తరపున ఆర్డర్ జారీ కాబడునని ఇందు మూలంగా తెలియచేయడమైనది.

ANIL KUMAR GORA
ADVOCATE,
Srikakulam Town & District.
PH: 9440503849/8309623414

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఫిర్యాదుల స్వీకరణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం, పరిష్కారం వేదిక (మీకోసం) సోమవారం నిర్వహించారు. 64 అర్జీలను స్వీరించారు. ఫిర్యాదుదారుల నుంచి నేరుగా సమస్యలు విన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ త్వరితగతిన ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్ (జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

పారదర్శక ఓటరు జాబితా లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శక ఓటరు జాబితాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కుమారి కె.సాయి ప్రత్యూష అన్నారు. నగరంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్ సమావేశ మందిరంలో బిఎల్‌ఒల శిక్షణా కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఈ శిక్షణ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ ఓటుహక్కు కల్పన లక్ష్యంగా చెప్పారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని 100 నుంచి 150 వరకూ ఉన్న పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటరు జాబితాలు సిద్ధం చేయటంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జి.కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ చక్రవర్తి పాల్గొన్నారు.

సమాచారం అందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అర్హుల వివరాలను సచివాలయ సిబ్బంది, సర్పంచ్, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందడం లేదని అందేలా చూడాలని పొన్నాం సర్పంచ్ ఎన్.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ అధ్యక్షతన నిర్వహించారు. పొన్నాంలో గత ప్రభుత్వం అందజేసిన జగనన్న స్థలాల్లో లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేందుకు అనుమతించాలని తహశీల్దార్ గణపతిరావును సర్పంచ్ రామకృష్ణ కోరారు. రాగోలు పంచాయతీలో కూటికుప్పలపేటలో అంగన్వాడీ భవనం నిర్మాణం సగంలో నిలిచిపోయిందని, వాటిని పున: నిర్మాణం చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని సర్పంచ్ గేదెల చంగలరావు కోరారు. పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు నూతన పింఛన్లు మంజూరు కావడం లేదని, అదేవిధంగా రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులతో పాటు కొత్త రేషన్‌కార్డులు అందించాలన్నారు. సమావేశంలో ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి దివ్య, ఇఒపిఆర్‌డి కె.సూర్యనారాయణ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- జి.సిగడాం

జి.సిగడాం మండలం డిఆర్ వలసలో రెండు రోజుల క్రితం జరిగిన నవగ్రహ గుడి విగ్రహాల ధ్వంస ఘటనను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిద్దాం గ్రామంలో జనసేన జి. సిగడాం మండల అధ్యక్షుడు మీసాల రవికుమార్ తల్లి ఇటీవల మృతిచెందడంతో ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే మండలం మెట్టవలస పంచాయతీ, పాలఖండ్యాం జంక్షన్ గృహసముదాయల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వలన ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్థలాన్ని పరిశీలించి స్వయంగా ఫోటోతీసి విద్యుత్ శాఖ అధికారులకు పంపించి ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు. ఈయనతో కుమరాపు రవికుమార్, కె.అప్పన్న, బంగారునాయుడు, కుర్మారావు, డబ్బాడ ఆది నారాయణ, గొల్లాజీ, ఎందువ శ్రీను, మహేష్, గోపాల కృష్ణరాజు, చిరంజీవి, సీతారాం, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వేగవంతమైన న్యాయం

ప్రజాశక్తి- పొందూరు

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం చేపట్టిన 'మధ్యవర్తిత్వం- దేశం కోసం' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునన్నారు. స్థానిక కోర్టులో ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించేందుకు న్యాయవాదులు కూన అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్‌లను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని వారంలో సోమవారం, శుక్రవారం రెండురోజులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

డిపాజిట్ చేసిన డబ్బులు ఇవ్వాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శారద

పోస్టుఫాసులో 2018లో రూ.4 లక్షలు డిపాజిట్ చేశానని, వారం రోజుల నుంచి తిరుగుతున్నా డబ్బులు చేతికి అందలేదని కొఠారి గ్రామానికి చెందిన డిపాజిట్‌దారు శారద వాపోయింది. సోమవారం డబ్బులు తీసుకొనేందుకు ఉదయం 8.30 గంటలకు పోస్టాఫీస్‌కు వచ్చానని తెలిపింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి ఉన్నాయని వాపోయింది. అప్పుడు డబ్బులు అడిగితే ప్రింటర్ పోయింది, విశాఖపట్నం వస్తుందని సిబ్బంది తెలిపారని అన్నారు. ఈ డబ్బులు ఇస్తే విశాఖలో ఇంజనీరింగ్ చదువుతున్న తన కుమార్తెకు పంపించాలని తెలిపింది. ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు ఇప్పించాలని కోరారు.

నిర్లక్ష్య ఉద్యోగులను సస్పెండ్ చేయిస్తా..

ఎమ్మెల్యే రవికుమార్

విఎఎల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తొగరాం రైతుసేవా కేంద్రం విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సత్యసాయిపై ఎమ్మెల్యే రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఉద్యోగుల నిర్లక్ష్య ధోరణి విధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ఎఒ మెట్ట మోహనరావు మాట్లాడుతూ సుమారు 400 క్వింటాల వరి విత్తనాలు తిరిగి పంపించడం జరిగిందని, పూర్తిస్థాయిలో రైతులందరికీ విత్తనాలు అందించడమే కాకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను కూడా పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయకులు ఎరువులు సకాలంలో అందించడం లేదని తన దృష్టికి వచ్చిందని, వారందరినీ సమావేశ మందిరంలోకి పిలిపించారు. కొంతమంది వ్యవసాయ శాఖ ఉద్యోగులు సకాలంలో ఎరువులు పంపిణీ చేయలేదని మందలించడంతో పాటు తొగారాం గ్రామ రైతుల నుంచి ఎరువులకు వసూలు చేసిన నగదును ప్రభుత్వానికి చెల్లింపులు సక్రమంగా చేపట్టడం లేదని, గత ప్రభుత్వంలో కూడా అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యే దృష్టికి రాగా తక్షణమే సదరు ఉద్యోగిపై రిపోర్టు సిద్ధం చేసి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు పంపించాలని, సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని తాను జెడికి సిఫార్స్ చేస్తానని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. మండలంలోని విఎఎల పనితీరు అధ్వానంగా ఉందని, విత్తనాలు, ఎరువులు అని ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా ఆన్‌లైన్‌లో విత్తనాలు విక్రయించినట్లు చూపెడుతున్నారని, దీనివలన విత్తనాలు రైతుసేవా కేంద్రాలకు రావాల్సినన్ని రావడంలేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోలార్ ప్యానల్‌ను మండలంలో మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన శ్రీనివాసచార్యుల పేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ప్రత్యేక ఆహ్వానితులు తమ్మినేని శ్రీరామమూర్తి, సభ్యులు నూక అప్పల సూరనాయుడు, సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, అధికారులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు వద్దు

ప్రజాశక్తి- నరసన్నపేట

కవిటి : వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు బెదిరించి పనులు చేయించుకునే ధోరని విడనాడాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులకు సోమవారం లేఖ రాశారు. ఈ నెల 10న నిర్వహించిన మెగా పిటిఎంలో జిల్లాలో ఉపాధ్యాయులందరూ తమకు శక్తి మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు, ప్రజాప్రతినిధులు, సహకారంతో విజయవంతం చేశారన్నారు. ఇప్పుడు అప్‌లోడ్ చేసిన ఫొటోలు, వీడియోలు బాగోలేలేదని, మరలా సరి చూసి బాగున్నవి అప్‌లోడ్ చేయాలని చెప్పడం సరికాదని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలోనే విద్యాశాఖ మంచి సామర్థ్యం ఉన్న కెమెరాతో కెమెరామెన్ కూడా నియామకం చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు తమ శక్తి మేరకు తీయించిన ఫొటోలు అప్‌లోడ్ చేశామన్నారు. ఫొటోలు బాగోలేకపోతే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి ఇవ్వాలని సంజాయిషీలు తెలపడం అనేది సరైనది కాదని, దీనిని యుటిఎఫ్ ఖండిస్తుందని అన్నారు. బోధ నేతర కార్యక్రమాలను ఉపాధ్యాయుల నెత్తి మీద రుద్ది అవే ప్రథమ ప్రాధాన్యంగా భావించడం అనేది సరికాదన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సక్రమంగా లేవు అని చెప్పి సంజాయిషీ అడిగితే ఒక పద్ధతిగా ఉంటుందని పేర్కొన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం ఫొటోలు అప్‌లోడ్ చేసిన ఫొటోలు సక్రమంగా లేవని చెప్పి సంజాయిషీ కోరడం అనేది సరైన విధానం కాదన్నారు.

కవిటి: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి విద్యాబోధనలోనే నిమగ్నంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్, జిల్లా సిపిఎస్ కో-కన్వీనర్ జి.,జానకిరావు, సీనియర్ కార్యకర్తలు బాలక శ్రీను, ఆది, వెంకటరమణ, పి.రవికుమార్, సూర్యం, శ్రీధర్ పాల్గొన్నారు.

నితిన్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

ట్రిపుల్ ఐటికి విద్యార్థి ఎంపిక

ఇచ్ఛాపురం: మండలం తీర ప్రాంత గ్రామం డొంకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.నితిన్ ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హెచ్‌ఎం జి.హేమకుమారి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఇటీవల ఎపి ప్రభుత్వం విడుదల చేసిన ఆర్‌జికెయుటి ట్రిపుల్ ఐటి రెండవ విడత ఎంపిక జాబితాలో నితిన్ జనరల్ కేటగిరి బిసిఎ విభాగంలో ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. నితిన్ పదో తరగతి పరీక్షల్లో 559 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల చైర్మన్ కె.జానకిరావు మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించినట్టయితే విద్యాబోధన అద్భుతంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దున్న కూర్మారావు, నీటి సంఘం అధ్యక్షులు గురుమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటరమణ, ఎల్ గోవిందరావు, కమలాకర్, శ్రీహరి, శంకర్ రెడ్డి, తాజ్, విద్యార్థులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

క్రీడలకు పూర్వవైభవం తెస్తా

శ్రీకాకుళం రూరల్: క్రీడలకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలం చింతాడలో క్రికెట్ టోర్నమెంట్ సీజన్- 2 గ్రాండ్ ఫైనల్ స్థానిక గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో క్రీడలకు ప్రాముఖ్యత ఉందని, అన్ని విధాలుగా సహకారమందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసు నాయుడు, శ్రీకాకుళం క్రికెట్ స్థానిక కమిటీ సభ్యుల బృందం, గ్రామాధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నెరవేరిన ట్రిపుల్ ఐటి కల

కవిటి: ట్రిపుల్ ఐటిలో చేరాలన్న ఓ బెంతు ఒరియా విద్యార్థి కల కోర్టు ఆదేశాలతో నెరవేరింది. మండలంలోని బొరివంకకు చెందిన నరేష్ బిసాయి పదో తరగతిలో 575 మార్కులు సాధించారు. ఇటీవల నిర్వహించిన ట్రిపుల్ ఐటి కౌన్సెలింగ్‌లో నూజివీడులో సీటు సాధించాడు. అయితే తరగతి ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో నరేష్ ఉన్నత చదువులకు అడ్డంకిగా మారింది. దీంతో నరేష్ కోర్టును ఆశ్రయించాడు. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన న్యాయస్థానం నరేష్ విద్యాభివృద్ధికి ఎటువంటి ఆటంకం లేకుండా యాక్టు-19 ప్రకారం ఆ విద్యార్థికి ప్రొవిజనల్ అడ్మిషన్ కల్పించాలని సూచించింది. దీంతో సదరు యాజమాన్యం సోమవారం నరేష్ బిసాయికి ప్రవేశం కల్పించింది. ఈ సందర్భంగా విద్యార్థి నరేష్ బిసాయితో పాటు బెంతు ఒరియా ప్రతినిధులు, సంఘం పెద్దలు న్యాయస్థానం తీర్పుపై కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి పంచాయతీ ఇఒగా హరికృష్ణ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజరు పంచాయతీ ఇఒగా టి.హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హిరమండలం పంచాయతీ ఇఒగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఇఒగా పనిచేసిన శ్రీనివాసరావు మేఘవరం పంచాయతీకి ఇఒగా బదిలీపై వెళ్లారు. ఇఒగా బాధ్యతలు స్వీకరించిన హరికృష్ణకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

విప్ దృష్టికి కొర్లాం సమస్యలు

జ్ఞాపికను అందజేస్తున్న కొర్లాం గ్రామస్తులు

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి జాగతి అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి, గ్రామ పెద్దలు తీసుకువచ్చారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నూకలూరులో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని, గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అగ్రహారం రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను పరిష్కారం చేయాలని, బారువ రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైళ్లు నిలుపుదల అయ్యేలా చూడాలని కోరారు. సోంపేట, పొత్తంగి రూట్లో పల్లె వెలుగు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గణపతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అశోకుని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరమణ, ఎన్.పున్నయ్య, ఎస్.ఢిల్లీరావు, పి.రాజేష్, ఎస్.ఈశ్వరరావు, ఎస్.మురళి, బి.నవీన్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతికి చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి, సుస్థిరత సాధించేలా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0, 2023 - 24 ఆర్థిక ఏడాదికి సంబంధించి కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, ఎఎన్‌ఎం లకు, మండల స్థాయి అధికారులకు, వైద్యులకు సోమవారం ఒకరోజు శిక్షణను నిర్వహించారు. పంచాయతీ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు సాధించే దిశగా తొమ్మిది టీమ్‌లకు సంబంధించి గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధి, ప్రగతికి సంబంధించి ప్రత్యేక అంశాలపై శిక్షణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై శ్రద్ధ కనబర్చి పరిష్కార మార్గం చూపించాలని, మీ స్థాయిలో సమస్య పరిష్కారం కాకుంటే పైస్థాయి అధికారులకు, జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. సమస్యలపై సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ప్రకాశరావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ : రైతులకు ఎరువులు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

మండలంలోని వైకుంఠపురంలో సోమవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామంలో రైతులకు అవసరమైన 445 బస్తాల యూరియా అందుబాటులో ఉందని గ్రామ సర్పంచ్ తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం, మాజీ సర్పంచ్ నానుపాత్రుని సత్యంలు ఎరువులు పంపిణీ చేశారు. గ్రామ రైతులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం: జి.సిగడాం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారులకు కూటమి నాయకులు మక్క నారాయణరావు, ఎస్.గోవిందరావు సూచించారు. సోమవారం మండలం పెంట గ్రామంలో రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు ఎరువుల పంపిణీ చేశారు. అవసరమైన ఎరువులను ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఎవరికీ ఎరువుల కొరత రాకుండా ఉండాలని గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ, మీసాల సంతోష్ బాబు, గ్రామపెద్దలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షులకు సన్మానం

లావేరు : సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ తదితరులు

లావేరు: లావేరు టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నికైన ముప్పిడి సురేష్‌ను సోమవారం పాతకుంకం మాజీ సర్పంచ్ డి.శ్రీనువాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనువాసరావు మాట్లాడుతూ వరుసగా 9వసారి సురేష్ టిడిపి మండల అధ్యక్షునిగా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే వ్యక్తి సురేష్ అని అన్నారు. సురేష్‌ను కలిసిన వారిలో నాయకులు మురళీమోహన్, మాజీ వైస్ ఎంపిపి మొరం సోంబాబు, ఇజ్జు రామకృష్ణ, కార్యకర్తలు ఉన్నారు.

శ్రీకాకుళం : జి.సిగడాం టిడిపి మండల అధ్యక్షుడుగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కుమరాపు రవికుమార్‌కు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సరిత, రెవెన్యూ సిబ్బంది సోమవారం దుశ్శాలువతో సత్కరించారు. అలాగే ఉపాధిహామీ మండల అధికారులు, ఎపిఒ చూళ్ల సత్య నారాయణ, ఇసి పురుషోత్తం సత్కరించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థి నాయకుని ఎన్నిక

ఎన్నికలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాయకుడు ఎన్నిక నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు ఆధ్వర్యాన సోమవారం ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికకు ఓట్లు వేసే పద్ధతిని అనుసరించారు. విద్యార్థులకు ప్రజాస్వామ్యం గొప్పతనం, ఎన్నికలు విశిష్టత తెలియజేశారు. ఓటింగ్ భావన తెలిసే విధంగా ప్రత్యక్షంగా వారినే ఓటరులుగా చేసి వారికి కావాల్సిన నాయకున్ని ప్రజాస్వామ్య బద్ధంగా ఎలా ఎన్నుకోవాలో వివరిస్తూ నమూనా ఓటింగ్ పక్రియను విద్యార్థులకు నిర్వహించారు. భవిష్యత్‌లో విద్యార్థులు బాధ్యత గల ఓటర్లుగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఉపాధ్యాయ బృందం వారిలో స్ఫూర్తి నింపింది. ఎన్నిక అనంతరం చేపట్టిన ఓట్లు లెక్కింపులో బి.సుమన్ పాఠశాల విద్యార్థి నాయకుడిగా ఎన్నిక కావడంతో హెచ్‌ఎం ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కె.రమణ, టి.కమలకుమారి ఎన్నికలు అధికారులుగా వ్యవహరించారు. ఎస్‌ఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరిమెళ్లకు ఘన నివాళి

ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న వర్శిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ సంపాదకులు, జాతీయ ప్రజాకవి గరిమెళ్ల సత్యన్నారాయణకు డా.బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ ఘన నివాళి అర్పించింది. ఆయన జయింతి కార్యక్రమాన్ని వర్శిటీ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించి గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విలువలు కలిగిన పాత్రికేయ రంగానికి గరిమెళ్ల ఒక శాశ్వత చిరునామా అని, ఆయన జీవితం ఎన్నటికి అణుసరనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. అనురాధ, కాశ్మీరు సెంట్రల్ యూనివర్శిటీ మాస్ కమ్యూనికేషన్ విభాగం అధ్యాపకులు డా.కె.జాన్‌బాబు, వర్శిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డా.కె. స్వప్న వాహిణి, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం శ్రీకాకుళం ప్రతినిధులు సుధాకర్, ప్రభాకర్, డైట్ (వమ్మరవల్లి) పూర్వ ప్రిన్సిపాల్ కె.అప్పారావు, ఎస్.సన్యాసిరావు, ఆర్.తిరువతిరావు, డా. జి.ఎల్.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : గరిమెళ్లకు నివాళ్లర్పిస్తున్న జర్నలిస్టులు

శ్రీకాకుళం సిటీ: గరిమెళ్ళ సత్యనారాయణ జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ఎపియుడబ్ల్యుజె, సామ్నా సంయుక్తంగా డిమాండ్ చేశాయి. గరిమెళ్ళ జయంతి సందర్భంగా స్థానిక నాగావళి తీరంలోని గరిమెళ్ళ విగ్రహానికి పూలమాలలు వేసి జర్నలిస్టులు నివాళ్లర్పించారు. గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎస్.నవచైతన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు, సామ్నా రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు హాజరయ్యారు.

పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యాన...

ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ తనగళాన్ని, కలాన్ని ఆయుధంగా మలచి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుడని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులు చెన్న కేశవరావు అన్నారు. నిజాయితికి, నిర్భీతికి మారుపేరుగా నిలిచి సాంఘిక అసమానతలపై గర్జించిన గొప్ప పాత్రికేయుడు అని అన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

బాబూరావు (ఫైల్)

కవిటి: మండలంలోని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న జాడు బాబూరావు (54) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. బాబూరావు భార్య శ్రీదేవి బారువ బాలికల పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా, వీరికి ఇద్దరు కుమార్తెలు. ఎంఇఒ ధనుంజయ మజ్జి బాబూరావు మృతదేహానికి నివాళ్లర్పించి మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఉపాధ్యాయుని ఆకస్మిక మృతిపై తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మహిళకు గాయాలు

పలాస : మండలంలోని నెమలి ఊరు సమీపంలో సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం ప్రగడపుట్టుకు చెందిన రేణుక గాయపడింది. క్షతగాత్రురాలు తన కుమారుడుతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చీర చెంగు చక్రాల్లోకి వెళ్లిపోవడంతో కిందకు జారిపడిపోయింది. వెంటనే 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఖరీఫ్ పంట నమోదు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతుల పంటలకు ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఖరీఫ్-25 అమలు అవుతుందని ఎఒ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకునే విధంగా అవకాశం కల్పించామని అన్నారు. భూస్వాములు, కౌలుదారులు అందరూ ఈ పథకానికి అర్హులన్నారు. నోటిఫైడ్ పంటలకు బీమా చెల్లింపులు తక్కువగా ఉండే విధంగా ప్రభుత్వం ప్రీమియంలో భాగంగా సబ్సిడీను అందజేస్తోందని తెలిపారు. మండలంలోని 7,734 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని, 6,743 మంది రైతులు పథకం ప్రయోజనాలు నమోదు ప్రక్రియ ద్వారా అవకాశం ఉందని అన్నారు. ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

పలాస డాక్టర్ కణితీస్ ఐటిఐలో ఉన్న మిగులు సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వికణితీస్ ప్రభుత్వ ఐటిఐ పలాస కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తుల స్వీకరణ 15 కాగా, దానిని 20 వరకు పొడిగించామని అన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెరిఫికేషన్‌కు ఈ నెల 22వ మధ్యాహ్నం 2 గంటల లోపల రావాలని కోరారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు ఈ నెల 25న ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్ హాజరు కావాలని తెలియజేశారు. ఐటిఐకి సంబంధించి వివిధ ట్రేడ్లలో 'కోపా ట్రేడ్'కు మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

సరోజాదేవి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అలనాటి వెండితెర తార సినీ రంగంలో చిరస్మరణీయంగా నిలిచిపోయిన నటి బి. సరోజాదేవి మరణం చిత్రసీమకు తీరనిలోటని శ్రీ వెంకటేశ్వర కళామండలి అధ్యక్షుడు కె.వి. రాజారావు పేర్కొన్నారు. సరోజాదేవి ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్ వంటి లెజెండరీ నటులతో కలిసి ఆత్మబలం, అమర శిల్పి జక్కన్న, జగదేక వీరుని కథ వంటి అనేక హిట్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. సరోజాదేవి మృతికి సంతాపం తెలిపిన వారిలో కె.శ్యామల రావు, కె.రామారావు, ఎం.విశ్వంత్, వై.ఎల్.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టివి వితరణ

కోటబొమ్మాళి: మండలంలోని బిర్లంగి ప్రభుత్వ పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన దుంపల మోహనరావు తన భార్య దుంపల సుగుణమ్మ జ్ఞాపకార్థం రూ.45 వేలు విలువైన ఎల్ఇడి టివిని సోమవారం అందజేశారు. ఉపాధ్యాయులు, సర్పంచ్ నూక సత్య రాజు, ఎంపిటిసి వాసు, వార్డు మెంబర్లు, దుంపల అప్పన్న, శ్రీను, కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

సైకిళ్లు పంపిణీ

సంతబొమ్మాళి : మండలంలోని యామలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వికె ఫౌండేషన్ సభ్యులు ఇద్దరు విద్యార్థినిలకు సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి వారిని చదువులో ప్రోత్సహించేందుకు తన వంతు సహాయంగా అందిస్తున్నామని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్‌ఎంసి చైర్మన్ గోవిందరావు అందించారు.

సైకిళ్లను అందజేస్తున్న సంజీవ్, ఉపాధ్యాయులు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

ప్రజాశక్తి- నరసన్నపేట

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పట్టణంలో 5వ వార్డు పరిధిలో బండి వీధులో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్‌లో తెలియజేసి పరిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ కొయిలాడ వెంకటేష్, నియోజకవర్గ యువ నాయకులు, సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని నడశంద్రలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, సంతోష్ పాల్గొన్నారు.

నరసన్నపేట : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని సామాజిక సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎనిమిదవ వార్డు గేటు ప్రాంతంలో టిడిపి నాయకులు మొదలవలస రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి ప్రభుత్వ పాలన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థానికంగా ఉన్న స్థల వివాదాలతో పాటు పలు వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, టిడిపి నాయకులు సూకరాజు, బోర గోవిందరావు, ఎస్.మురళీ, సునీత, మురళీధర్ యాదవ్, డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

కోటబొమ్మాళి: దేశ వ్యాప్తంగా క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు సాగుతుందని క్షయవ్యాధి నివారణ అధికారి పి.వి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని సౌడాంలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకిన తర్వాత వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుని నిర్దేశించిన మందులను వాడాలన్నారు. అలా వాడటం వల్ల వ్యాధి తీవ్రతతో పాటు వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. క్షయ వ్యాధిని నిర్మూలించడానికి ఆరోగ్యశాఖ ప్రత్యేకమైన దృష్టి సారించిందన్నారు. అందుకు అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పి.రమణి, ఎఎన్ఎం ఎస్.ప్రభావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

జాతీయస్థాయి నాట్య పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - ఆమదాలవలస

విశాఖపట్నంలో ఈనెల పది నుంచి 13వ తేదీ వరకు నాట్య రవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన 36వ జాతీయ నాట్య పోటీల్లో పట్టణంలోని భవిత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. భరతనాట్యం పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని తమ్మినేని సాత్విక మూడో బహుమతి, గ్రూపు పోటీలో మొదటి స్థానం సాధించింది. తమ్మినేని భూమిక చైర్మన్ అవార్డుతో పాటు గ్రూపు పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. వీరితోపాటు డి.జస్మిత కూడా చైర్మన్ అవార్డును దక్కించుకుంది. వీరికి విశాఖ కళాభారతి ఆడిటోరియంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ జి.ఎస్.ఎం రాజు అవార్డులు అందజేశారు. వీరిని భవిత పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత, హెచ్ఎం కె.వెంకటేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఆనందంగా గడపాలి

శ్రీకాకుళం సిటీ: ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ వహించి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా హోంగార్డు విభాగానికి చెందిన హోంగార్డు ఈ నెల 11న ఉద్యోగ విరమణ పొందిన ఎల్.వి.ఆర్ మూర్తిని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందించి సర్వీస్ ప్రశంసాపత్రం ప్రధానం చేశారు. ఈ నేపథ్యంలో తక్షణ ఆర్థిక చేయూతగా రూ.5వేలు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సుదీర్ఘంగా విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయడం, కేటాయించిన అన్ని విధులు అంకిత భావంతో నిర్వర్తించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయం, అవసరం ఉన్న పోలీసుశాఖ తప్పకుండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎఓ సిహెచ్ గోపినాథ్, ఆర్ఎస్ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- కవిటి

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీల్లో కవిటికి చెందిన క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఇప్పటికే అండర్-11 విభాగంలో నిర్వహించిన సమన్విత, బల్లెడ రూపిణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా, అండర్-19 విభాగంలో కవిటికి చెందిన మాదుగుల శేషు - అభిరామ్ జంట ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. దీంతో ఆగస్టు నెలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఈ జంట ఎంపికైంది. ఈ సందర్భంగా ఉషోదయ యువజన సంఘం, ఉషోదయ బ్యాడ్మింటన్ అసోసియేషన్, గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు విజేతలను అభినందించారు. వచ్చే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వారు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని ఆశించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని శక్తి టీం ఎస్ఐ జి.వాసుదేవరావు అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాల, భాష్యం స్కూల్‌లో సోమవారం శక్తియాప్‌లోని అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100, 112 కాల్స్‌కు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదు ఏ విధంగా చేయాలి తదితర విషయాలను తెలియజేశారు. 1098 చైల్డ్‌హెల్ప్‌లైన్, 1091 మహిళా వేధింపులు, అక్రమ రవాణా, 1930 సైబర్ నేరాలు, 1972 గంజాయి, మత్తుపదార్థాలకు సంబంధించి టోల్‌ఫ్రీ నెంబర్లపై వివరించారు. కార్యక్రమంలో శక్తిటీం ఎఎస్ఐ డి.రమణమూర్తి, డబ్ల్యుపిసి కె.ఉషారాణి, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు డి.బి.రాజు, ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శక్తి టీం సభ్యులు

సమర్థవంత నిర్వహణకు శిక్షణ అవసరం

శిక్షణ ఇస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి- పలాస

నాయకత్వ శిక్షణతో ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించగలరని పలాస, సోంపేట ఎంఇఒ చెరుకుపల్లి సత్యం, కృష్ణంరాజులు అన్నారు. స్థానిక సూర్యతేజ కళాశాలలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలోని 12 మండలాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం నాయకత్వ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలను సమర్థవంతంగా నడిపించడానికి, విద్యాపరమైన లక్ష్యాలను సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పుతుందన్నారు. ఈ శిక్షణతో కొత్త బోధనా వ్యూహాలను రూపొందించడం, అమలు చేయడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ శిక్షణ తరగతులను పోలాకి, సారవకోట కెజిబివి ప్రిన్సిపాళ్లు జె.శారద, అరుణ నాయుడు, ఎంఎస్ పల్లి, పాతపట్నం, సోంపేట మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు ఎస్.శివప్రసాద్, కె.రత్నకుమారి, చిన్నాజీవర్మలు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరిస్తున్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఆర్థికసాయం అందజేత

ఇచ్ఛాపురం : మండలంలోని కేశుపురానికి చెందిన సూరు తాతయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాశీమాత సేవా సమితి సభ్యులు స్పందించి రూ.20 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. తమ సంస్థ ద్వారా ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సూరి రమేష్, గుజ్జు ప్రకాష్, ధర్మరాజు, నరేంద్ర, యువరాజ్ పాల్గొన్నారు.

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై చేసిన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ వెంకటరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలన్నారు. హేయమైన, నీచాతినీచమైన పదజాలంతో మారణాయుధాలతో దాడి చేయడం చూస్తుంటే శాంతి భద్రతలు ఏ విధంగా దిగజారాయో అర్థమవుతుందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఎంత ఘోరంగా అమలు చేస్తున్నారో ప్రజలకు అవగతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య, వైసిపి నాయకులు శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, రాజశేఖర్‌రెడ్డి, కాళ్ల సత్యం, పిలక సంతోష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రశంసాపత్రం, మెమోంటోతో స్నేహాంజలి

అలరించిన స్నేహాంజలి భరతనాట్యం

పొందూరు: తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా భద్రాచలంలోని రామాలయంలో నిర్వహించిన 'భద్రాద్రి సాంస్కృతిక వారధి పాహిరామ ప్రభో' కార్యక్రమంలో ఆదివారం రాత్రి పొందూరు మండలం లచ్చయ్యపేటకు చెందిన సనపల స్నేహాంజలి భరతనాట్యంతో ఎంతగానో ఆకట్టుకుంది. స్నేహాంజలి ప్రదర్శించిన భరతనాట్యం ఆకర్షణగా నిలవడంతో ఆలయ ధర్మకర్తలు, యాజమాన్యం మెమెంటో, ప్రశంసాపత్రం, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తమ్మినేని పరామర్శ

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త చందక సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, వైసిపి రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వర రావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, పొందూరు మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రాంబాబు, మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, తొత్తడి సురేష్, వావిలపల్లి మురళీ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగ్రాసాలతో పాల దిగుబడి

అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

కోటబొమ్మాళి: నాణ్యమైన పశుగ్రాసాలు పండించి శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు మేమినట్లయితే అధిక పాల ఉత్పత్తి పెరుగుతుందని కోటబొమ్మాళి పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.లోకనాథం అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కురుడులో పశు వైద్య అధికారి ఎల్.కిరణ్‌కుమార్‌తో కలిసి పాడి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో పశువులకు పశుగ్రాసాలు పండించి వేస్తే సులభంగా జీర్ణం అవుతుందని తెలిపారు. కాల్షియం, భాస్వరం వంటి ఖనిజ లవణాలు, ఎండిఇ వంటి విటమిన్లు మెండుగా ఉంటాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. నాళ్ల చిన్న, బోర నాగభూషణరావు పాల్గొన్నారు.